క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

వీపనగండ్ల: అర్ధాంతరంగా విద్యను మానేసి నిరుద్యోగులుగా ఉన్నా యువత వ్యవసాయ రంగంపై ఆసక్తి ఉన్నవారికి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం, నారు మడుల తయారీ తదితర వ్యవసాయ అంశాలపై ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు మండల ఉద్యానవన శాఖాధికారి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, ఆసక్తి ఉన్న రైతులు వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో నర్సరీల్లో షెడ్‌ల ఏర్పాటు, పాలీహౌస్‌ల నిర్మాణం, మొక్కలు అంటుకట్టడం, బండింగ్, గ్రాఫ్టింగ్, లేయరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వీటితోపాటు పండ్లు, పూలపెంపకంపై కూడ అవగాహన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డు గాంధీనగర్‌కు చెందిన బాలస్వామి మంగళవారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ద్యారపోగు వెంకటేష్, మన్నెంకొండ, సురేష్, శ్రీను ఉన్నారు.

చిన్నంబావి: మండలంలోని దగడపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుజ్జుల నాగేష్‌నాయుడు అనారోగ్యానికి గురై మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, కళ్యాణ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి పరామర్శించి, మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్ యాదవ్, చిదంబర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, రంజిత్‌కుమార్, తేజారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎండీ జబ్బార్‌కు..



పెబ్బేరు రూరల్: సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, ప్రజా వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ మురళీధర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు గంధం నాగరాజు, సీవీ రామన్ టాలెంట్ స్కూల్ డైరెక్టర్ నవీన్‌రెడ్డి మంగళవారం నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న జబ్బార్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సకాలంలో మందులు వేసుకుని త్వరగా కోలుకోవాలని జబ్బార్‌కు సూచించారు.

హరిత మొక్కల సంరక్షణకు చర్యలు



కొత్తకోట రూరల్: వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దమందడి ఎంపీఓ శ్రీరాంరెడ్డి నర్సరీల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం పెద్దమందడి మండలంలోని మోజర్ల శివారులో గల నర్సరీని, పల్లెప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వరకు నాటిన మొక్కలు, నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం రెండుపూటల నీళ్లు పట్టాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని కూలీల సంఖ్య పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

'ఉపాధి'ని ఎత్తేస్తే ఉద్యమిస్తాం

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తున్నారని, పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగనీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పంచాయతీ కార్మికుల వెతలు

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- కుటుంబ పోషణకు అవస్థలు
- ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె చేస్తామంటున్న కార్మికులు



తెల్లరాళ్లపల్లితండాలో డ్రెయినేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేస్తున్న కార్మికులు



పెండింగ్ వేతనాలపై నిరసన చేస్తున్న కార్మికులు (ఫైల్)

పాన్‌గల్: ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క నెల వేతనం ఆగిపోతేనే ధర్నాలు, నిరసనలు చేస్తారు. రెక్కాడితే కానీ డొక్కాడని పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే తమ జీవితాలెలా గడుస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్‌గా వేతనాలు అందక కుటుంబాలు గడవక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. వేతనాలు చెల్లించాలని ఎన్నో మార్లు ధర్నాలు, నిరసనలు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించే వారే కరవయ్యారని కార్మికులు అంటున్నారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 130 మంది కార్మికులు పనిచేస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, తాగునీరు అందేలా చూడటం, పంచాయతీ మోటార్ల నిర్వహణ వంటి పనులు చేసే వీరికి సుమారుగా 4 నెలలుగా వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు వేస్తున్న ప్రభుత్వానికి తమ ఇబ్బందులు కన్పించడం లేదా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. దీంతోపాటు శానిటేషన్ సామగ్రిని కూడా పంపిణీ చేయాలని కార్మికులు కోరుతున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో జీపీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుంది. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల సంయుక్త చెక్ పవర్ రావడంలో ఆలస్యం కావడంతోనే వేతనాల చెల్లింపులో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలను రెగ్యులర్‌గా వేయకపోతే పనులు నిలిపి వేసి సమ్మె చేస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

మండలాల వారీగా కార్మికులు

మండలం	జీపీలు	కార్మికులు
పాన్‌గల్	28	130
చిన్నంబావి	17	70
వీపనగండ్ల	14	64

కుటుంబ పోషణ భారంగా ..



ప్రతి నెల వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారింది. దీంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో సమ్మె చేసిన సమయంలో వేతనాలు రెగ్యులర్‌గా అందిస్తామని అధికారులు చెప్పినా అమలు కావడం లేదు. ఇప్పటికైనా కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రతి నెల వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– అర్జునయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, పాన్‌గల్

రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలి



జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలి. పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా కార్మికులకు వేతనాలు ఇవ్వాలి. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే పనులు నిలిపి కార్మికులతో కలిసి సమ్మెకు దిగుతాం.

– సూర్యవంశరాము, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి

త్వరలో వేతనాలు జమచేస్తాం



కార్మికుల పెండింగ్ వేతనాలను త్వరలో వారి ఖాతాలో జమ చేస్తాం. జీపీల ప్రత్యేకాధికారుల చెక్‌పవర్ రావడంలో ఆలస్యం కావడంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరిగింది. రెండు, మూడు రోజుల్లో అన్ని పంచాయతీల కార్మికుల వేతనాలు చెల్లిస్తాం.

– రఘురాములు, ఎంపీఓ, పాన్‌గల్

'ఖిల్లా' ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మంగళవారం మండల కేంద్రానికి చెందిన 'ఖిల్లా' ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పెద్దలు బండారి శ్రీనివాసులు, రాళ్ల కృష్ణయ్య, మునగాళ్ల నరేందర్‌బాబు, విప్పటూరు విక్రం, రాఘవేందర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 15 ఏళ్లుగా ఖిల్లా ఘనపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు 'ఖిల్లా' ఫ్రెండ్స్ యూనిట్‌గా ఏర్పడి ప్రజల దాహార్తి తీర్చడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రతి రోజు వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వారు, బస్టాండుకు వచ్చే ప్రయాణికుల దాహార్తి తీర్చుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గిరి, పెద్ద అంజనేయులుగౌడు, గంగారపు రాజు, బండారి కృష్ణయ్య, దాసర్ల భూమయ్య, సృజన్‌కుమార్, రామన్‌గౌడు, బండారి రమేష్, టైలర్ రాములు, పల్లాటి శతాయువు, రాంచంద్రి, చిన్న అంజనేయులుగౌడు, తుఫాన్ అసోసిఏషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సభ్యులు, పెద్దలు

మద్యం దుకాణాల మూసివేత

ఆత్మకూర్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆత్మకూర్‌లోని మద్యం దుకాణాలను మూసివేయించినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణకాంత్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని మూడు మద్యం దుకాణాలతో పాటు మంజునాథ బార్ అండ్ రెస్టారెంట్‌ను మూసివేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొర్రెపిల్లల మందపై కుక్కల దాడి

అమరచింత: గొర్రె పిల్లల మందపై ఊర కుక్కలు దాడిచేసి ఎనిమిదింటిని చంపిన ఘటన మంగళవారం పట్టణ శివారులో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన కంకలి రవి గొర్రెలను పెంచడంతో పాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో 10 గొర్రె పిల్లలను కొనుక్కొని వచ్చి పొలంలోనే మేపుతున్నాడు. సోమవారం మధ్య రాత్రి పొలంలో గొర్రె పిల్లల మందను వదిలి ఇంటికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లగా కుక్కల దాడి చేయడంతో గొర్రె పిల్లలు రక్తపు మడుగులో ఎక్కడ పడితే అక్కడ పడి ఉన్నాయి. ఎనిమిది గొర్రె పిల్లల చనిపోవడంతో రూ.70 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు.

రైతు రుణమాఫీ చేయాలని వినతి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రుణమాఫీ, రైతుబంధు ఇచ్చి అన్నదాతలను ఆదుకోవాలని బీజేపి పార్లమెంట్ కన్వీనర్ కుర్వ రమేష్, కో కన్వీనర్ భరత్ భూషణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ఎన్నికల కోసమే హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని మండి పడ్డారు. భూగర్భ జలాలు అడుగంటి బోరు పంపుల్లో నీరు రాక రైతులు సాగు చేసిన పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన చెందారు. పెట్టిన పెట్టుబడులు రాలేని పరిస్థితులలో రైతులు ఉన్నారని పంట పెట్టు బడులకు తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాలు పడే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. వెంటనే రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

కోడేరు: పస్పుల, ఎత్తం గ్రామ శివారులోని రెండు గ్రామాల్లోని 21 విద్యుత్ మోటర్ల రాగి వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పస్పుల గ్రామ శివారులో పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మాలాపూర్ చెందిన 7 మంది రైతులు కేఎల్ఐ కాల్వలో సాగు నీటికోసం విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు మోటర్లలో ఉన్న రాగి వైర్లను చోరీ చేశారు. అదేవిధంగా ఎత్తం శివారులో బీమా కాల్వలో 14 మంది రైతుల విద్యుత్ మోటర్ల వైర్లను ఎత్తుకెళ్లారు. ఆయా గ్రామాల రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

రేషన్‌లో.. ప్లాస్టిక్ బియ్యం

మానవపాడు: మండల కేంద్రంలోని చెన్నిపాడు లో ఓ ఇంట్లో రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చాయని సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది. రేషన్‌బియ్యంలో నిజంగానే ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయా? లేదా వాటిలో ప్రొటీన్‌తో కూడిన బియ్యం ఉన్నాయా? అని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ వివరణ కోరగా రేషన్‌లో వచ్చే బియ్యం పోర్టిఫైడ్ రైస్ అని, ఇవి ప్రొటీన్‌తో కూడినవని పేర్కొన్నారు. బియ్యం నానబెడితే ఇవి నీటిపై తెలియాడుతూ ఉంటాయన్నారు.

వరల్డ్ టీబీ డే అవార్డులు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి టీబీ వ్యాధి నియంత్రించడంలో ఉత్తమ సేవలు చేసిన డీఎమ్ఎచ్ఓ శశికళ చేతుల మీదుగా డాక్టర్ రిజ్వానా తాన్విర్, సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎస్ఎమ్ మాబమ్మ, ఆశ వర్కరు అనిషా బేగంలకు ఉత్తమ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు ఎల్లప్పుడు అందించడానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని వారు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, రోగులకు సేవలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- ప్రమాదాల బారిన వాహనదారులు



ఎన్‌హెచ్ 44 నుంచి రాంపురం వరకు వెళ్లే రోడ్డు



రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రైతులు మట్టి వేస్తున్న దృశ్యం (ఫైల్)

పెబ్బేరు రూరల్: గ్రామీణ ప్రాంత బీటీ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఐదారేళ్లుగా రోడ్ల మరమ్మతుపై అధికారులు దృష్టి సారించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. రోడ్లపై తారు లేచి రాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనదారులు నిరంతరం ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారులపై రెండు వాహనాలు ఎదురుగా వస్తే వాహనం రోడ్డు దిగినప్పుడు పక్కన్న ఉన్న గుంతలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే బాధలు వర్ణనాతీతం అని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎన్‌హెచ్‌-44 నుంచి రాంపురం, రామమ్మపేట, గుమ్మడం నుంచి యాపర్ల వరకు వెళ్లే రహదారులు ప్రయాణానికి అనువుగా లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రోడ్ల పరిస్థితి దారుణం

ఎన్‌హెచ్ 44 నుంచి రాంపురం వరకు రోడ్డు దారుణంగా ఉంది. ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామస్తులం కలసి కొంతదూరం రోడ్డుపై మట్టి వేయించాం. కానీ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పదించి రోడ్డు మరమ్మతు చేయ్యాలి.

– ఎంకే మూర్తి, రాంపురం

ప్రమాదాల బారిన పడుతున్నాం

గుమ్మడం నుంచి యాపర్ల వరకుకు ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. గుంతల్లో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోవడంతో పలువురు గాయాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలి.

– స్వామి, గుమ్మడం

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని గ్రామీణ రోడ్ల మరమ్మతు కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయిన వెంటనే పనులు మొదలు పెడుతాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్ర త్తలు తీసుకుంటాం.

– రమేష్ నాయుడు, ఏఈ

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ఐదో రోజు మంగళవారం భౌతిక శాస్త్రం సబ్జెక్టు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాష, సురేష్, డిపార్టుమెంటల్ అధికారులు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 143 మంది కలిపి మొత్తం 363 మంది విద్యార్థులకు వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాలల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వేణు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తకోట రూరల్: త్వరలో జరుగబోయే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రోజు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి దగ్గర రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉండరాదని, వెండి, బంగారం, ఆభరణాలు అనుమతులు లేకుండా తరలిస్తే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దేవాలయాల్లో, మసీదుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని, ఏ పార్టీకి చెందిన వారైనా వస్తురూపేనా బహుమతులు పంచితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నడుపుతున్న, గ్రామాలకు మద్యం తరలిస్తున్నా ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని వివరించారు.



సీఐ రాంబాబు

నందిమళ్లకు బస్సు పునరుద్ధరణ

అమరచింత: ఎన్నో ఏళ్లుగా గ్రామానికి ఆర్‌టీసీ బస్ సౌకర్యం లేక నందిమళ్ల గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలను గుర్తించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు వచ్చేటట్లు చొరవ తీసుకున్నారు. గద్వాల డిపో చెందిన బస్సు అమరచింత, ఆత్మకూర్ వరకు సేవలు అందించనుంది. కానీ గ్రామానికి రహదారి వ్యవస్థ సరిగా లేదని బస్ సర్వీస్‌లను నిలిపివేశారు. దీంతో గ్రామ ప్రజలతో పాటు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపెరించిందని, తమ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన వాకిటి శ్రీహరి విన్నవించడంతో.. ఎమ్మెల్యే గెలిచిన ఆయన ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నారు. గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి జూరాల డ్యాం మీదుగా నందిమళ్ల, అమరచింత, ఆత్మకూర్ వరకు బస్ సౌకర్యం కల్పించాలని కోరడంతో వెంటనే మేనేజర్ స్పందించి బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. దీంతో మంగళవారం గ్రామానికి బస్సులో వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు, ప్రజలు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని శాలువాతో సన్మానిస్తున్న విద్యార్థులు

ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు



వనపర్తిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు మంగళవారం రాత్రి స్థానిక మసీదే నూర్‌లో స్టార్ గ్లాస్, హార్డ్‌వేర్ వారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్‌అలీంరషాది ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూనూస్, అన్వర్, జహంగీర్, ఇమ్రాన్, ఇస్మాయిల్, వాహేద్, నవీద్, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలోని తయాబ్ మసీదులో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ముస్లింలు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు.



ఆత్మకూర్‌లో..

పర్వతాపురంలో లాకర్ అపహరణ

ఖిల్లాఘనపురం: తాళం వేసి ఉన్న ఇంట్లో ఓ వ్యక్తి తిరుజోడు(పురాతన లాకర్)ను అపహరించిన ఘటన మండలంలోని పర్వతాపురంలో సోమవారం చోటు చేసుకోగా మంగళవారం వెలుగు చూసింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యురాలు ఇందిరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతాపురం గ్రామానికి చెందిన వాసిరెడ్డితో పాటు వారి కుమారులు గతంలో మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి వారి కుటుంబ సభ్యులంతా మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన బోయ నరేష్ ఓ బొలేరో వాహనంతో పాటుగా కొంతమంది కూలీలను తీసుకొచ్చి, ఇంటి తాళం తొలగించి ఇంట్లో ఉన్న పురాతన కాలం నాటి తిరుజోడును తీసుకెళ్లాడు. గమనించిన గ్రామస్తులు మహబూబ్‌నగర్‌లో ఉన్న ఇంటి సభ్యులకు తెలిపారు. వారు సాయంత్రం వచ్చి చూడగా ఇంట్లోని తిరుజోడు కనిపించకపోవడంతో విషయాన్ని గ్రామ పెద్దలకు వివరించారు. వారు మంగళవారం ఉదయం పంచాయతీ పెట్టి నరేషను పిలిచి మాట్లాడాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న నరేష్ రాత్రి సమయంలో తిరుజోడును తెచ్చి వాసిరెడ్డి ఇంటి సమీపంలో వేసి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దానిని రాత్రివేళలోనే పోలీస్టేషన్‌కు తరలించారు. నిందితుడిని పోలీస్టేషన్‌కు పిలిచారు. అనంతరం వారి నుంచి వివరాలు తెలుసుకుని తిరుజోడును ఇంటి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.



నిరుపయోగ గంగా వాటర్ ట్యాంక్

మానవపాడు: మండలంలోని అమరవాయిలో వాటర్ ట్యాంక్ వృథాగా దర్శమి స్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొక్కలకు నీటి సదుపాయం, గ్రామ పంచాయతీ అవసరాలకు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి ట్యాంక్‌ను వాడుకునేవారు. నీటి ట్యాంక్ నిరుపయోగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో పెడుతున్నారు. చెట్లకు, మొక్కలకు నీటిని పెట్టకపోవడంతో ఎండ తీవ్రతకు ఎండిపోతున్నాయి.